
పవని నిర్మల ప్రభావతి

# ఇదీ నిజం



డైనింగ్ టేబిల్ మీద భోజనసామగ్రి అందంగా అమర్చింది అపర్ణ. "మీరు రావచ్చు!" అంది మెల్లగా గెస్ట్స్ రూంకేసి చూస్తూ.

"అదో సిగ్నల్ వచ్చిందోయ్ మధూ! పద!" నవ్వుతూ స్నేహితుడి వేపు చూచాడు గోపీకృష్ణ.

ఇద్దరూ డైనింగ్ టేబిల్ దగ్గరకు వచ్చారు. అపర్ణ అక్కడ లేదు.

"అపర్ణా! ఇక మేం మా స్వంత వడ్డన ప్రారంభించాలా?" విసుగ్గా వంటగది వేపు చూచాడు గోపీకృష్ణ.

"మరి నన్ను రమ్మంటారా?" మృదువుగా వినవచ్చిందామాట.

"అదీ చెప్పాలా?" అన్నాడు చిరాకుగా. వెంటనే మధు వేపు తిరిగి, "మా అపర్ణ ఘోషాతో చచ్చిపోతున్నారా బాబూ! కొత్త వాళ్ళు వచ్చారూ అంటే

ఇక వంటింట్లోనుంచి బయటకు రాదోయ్! చచ్చే చావయ్యింది!" అన్నాడు. ఆ మాటలలో సగం కోపం, సగం చిరాకు నిండివుంది.

గబుక్కున అపర్ణ బయటకువచ్చింది. "మీరు కలుపుకోండి, నేను వడ్డిస్తాను!" అంది. క్షణకాలం మధు అనిమిషునిలా అయిపోయాడు. ఎక్కువ పొట్టీ, పొడవూ కాని సమ ఎత్తులో బొద్దుగా, తెల్లగావుంది. ముచ్చటగా చుట్టుకున్న జుట్టుముడి, చెవులకు ఎర్ర రాళ్ళ దుద్దులు, మెడలో మూడుపేటల బంగారు గొలుసూ, నల్లపూసలూ, నుదుటిమీద ఎర్రని నిలువు బొట్టూతో వున్న అపర్ణ, కళ్లు చెదరగొట్టే సౌంద ర్యవతేం కాదు...కానీ ఏదో ఆకర్షణ దాగివుం దావిడలో!

"మీరు కలుపుకోండి, నెయ్యి వేస్తాను-" భర్తకు నెయ్యి వడ్డించాక, మధు చూపు తనని ఆపాదమస్తకం పరికిస్తుండటం గమనించి, హెచ్చ రించింది.

మధు క్షణకాలం లోలోపల సిగ్గుతో గిలగిలలాడిపోయాడు.

"గోపి ఏమనుకునివుంటాడు? ఆమె ఏమనుకునివుంటుంది. లోలోపల మథన పడిపోయాడు. భోజనం చేస్తున్నంత సేపూ అపర్ణను అణువణువూ పరిశీ లిస్తున్నా యతగాడి చూపులు. "ఏదో ఆకర్షణవుం దీవిడలో... అదేమిటి?" అదే ఆలోచన. కూరలో సాంబారు కలిపేసుకున్నాడు. రసంలో వూరిన మిరపకాయ నంజుకున్నాడు. పెరుగులో ఊరగాయకు బదులు ఉప్పు నంజు కున్నాడు!

"నిన్ను చూసి షాక్ తిన్నట్లున్నాడు మా ఫ్రెండ్!" ఆరాత్రి పడుకోబోతూ అపర్ణతో అన్నాడు గోపీకృష్ణ.

"అవును!" మెల్లిగా అంది అపర్ణ తన దోమతెర సరిచేసుకుంటూ.


"అవును..." వెక్కిరించాడు గోపి కృష్ణ. "అలా అనటానికి సిగ్గువెయ్య టంలేదూ?"

"సిగ్గా? ఎందుకూ?"

"ఒక్కసారి మధు భార్య పద్మజను చూడాలి నువ్వు. అప్పుడర్థమౌతుంది ఎందుకో!"

"ఆవిడ చాలా అందంగా వుంటుందా?" కుతూహలంగా అంది అపర్ణ.

"ఊహూఁ! పెద్ద అందమని చెప్ప లేను.... కానీ ఏదో ఆకర్షణవుం దామెలో. నీలా నల్లలూ, మట్టెలూ వేసుకోదు. రెండు జడలు వేసుకుంటుంది. డైనింగ్ టేబిల్ దగ్గర అతిథుల ఎదు రుగా కూర్చుని అడిగి అడిగి మరీ తిని పిస్తుంది. గంటలకొద్దీ కబుర్లు చెబు తుంది. అందుకే అక్కడికి వెళితే - మధు వాళ్ళింట్లో వారం రోజులున్నా నాకు విసుగనిపించదు...."




వింటున్న అపర్ణ ఫక్కున నవ్వింది.

"ఎందుకూ నవ్వు?" రోషంగా అరిచాడు గోపీకృష్ణ.

"నవ్వక ఏంచెయ్యను? ఆవిడలా నేనుండలేదని మీకు కోపం అవునా? నా తత్వం ఇది....ఆవిడ తత్వం అది .. అన్నట్లు... మీ ఫ్రెండ్ కిష్టమైన టిఫినేమిటో చెప్పండి. రేపు చేస్తాను ..."

"ఆహాఁ! రాత్రి భోజనం అంచక్కా వడ్డించావు ... వాడు సరిగా తిననే లేదు! ఇక టిఫిన్ పెడతావు! అందులో రేపంతా నాకు ఆఫీస్‌వర్క్ చాలా వుంది! రోజంతా ఆఫీసులోనే గడిపెయ్యాలో ఏమిటో? కంపెనీ లేక గిలగిలలాడుతాడో ఏమో మధు .."

"సర్లెండి! నాకు నిద్రవస్తోంది ..." అపర్ణ దుప్పటి బిగించేసింది.

* * *

మధుకు దిక్కుతోచడంలేదీరోజు. హాయిగా మధ్యాహ్నం వూరికెళ్లిపోయినా బావుండేదేమో? కానీ గోపీ కదలనిస్తేనా తనని?

ఆవిడగారు ... ఆ అపర్ణాదేవిగారేమో ఘోషాస్త్రీ కంటే అన్యాయం. ఇంటికొచ్చిన అతిథి కింత తిండి, పడుకోవటానికో గది ఏర్పాటు చెయ్యటంతో తీరిపోయిందని కాబోలావిడ ఉద్దేశ్యం. చదువుకున్న స్త్రీ కదా? తనతో కబుర్లు చెప్పకూడదూ? అతిథి

వున్నాడా, చచ్చాడా? అన్న ఆలోచన లేని మహానుభావురాలు...

"మీరు వచ్చి టిఫిన్ పుచ్చుకోండి!" గది బయటనుంచి వినిపించిన అపర్ణ మృదువైన పిలుపుతో త్రుళ్లిపడ్డాడు మధు.

"ఆ...! ఆ...!" అన్నాడు కంగారుగా లేస్తూ! ఆవిడ టేబిల్ మీద టిఫిన్, మంచినీళ్ళు పెట్టి వెనుదిరిగి వెళ్తోంది. వెళ్తున్న ఆమెకేసే చూస్తూ కూర్చుండి పోయాడు మధు...అందం...వుహూ! అందంకంటే ఎక్కువైన ఆకర్షణ... ఏమిటిది? తనలో ఏదో మనోవికారం.... ఛ...ఛ...తప్పు.. తప్పు...పొల మారింది.

"మెల్లిగా...మెల్లిగా సర్దుకోండి. మంచినీళ్లు తాగండి .. పైకి చూడండి. పకోడీలలో కారం ఎక్కువయిందల్లే వుంది...మీకు కారం ఎక్కువగా వుండాలని చెప్పారు వారు... పోనీ కాస్త స్వీట్ నోట్లో వేసుకోండి!" అపర్ణ టేబిల్ మీదకు వంగి, ఆదుర్దాగా క్షమాపణ చెప్పుకుంటున్నట్లు అంటోంది ...గాభరాగా చూస్తోంది...

"ఫర్వాలేదు .. కొద్దిగా పొల మారింది అంతే!" నవ్వేశాడు మధు.

"హమ్మయ్య!" హాయిగా నిట్టూర్చింది. "టీ పుచ్చుకోండి!" ఆ నల్లని పెద్ద కళ్లలో భయం తొలిగి సంతోష చ్ఛాయలు ప్రతిఫలించాయి... మెల్లిగా లోపలికి వెళ్లిపోయింది.

విచిత్రమైనభావం . కాదు భూతం ...తలెత్తుతోంది తనలో...ఛీ...తప్పు ఆమె గృహిణి...తన స్నేహితునిభార్య. తనూ ఓ వివాహితుడు ... పద్మజకు భర్త.. ఏమిటీ వెర్రి ఆవేశం?


గదిలోకి వెళ్ళి కిటికీ దగ్గర నిల్చున్నాడు. పెరట్లో అపర్ణ సన్నజాజులు కోసుకొంటోంది. జుట్టు ముడి వీడి, పొట్టి జడ వీపుపైన కదలాడుతోంది. అప్రయత్నంగా ఆమె తిరిగి చూచింది. క్షణకాలం ఇరువురి కళ్లూ కలుసుకున్నాయి. జాజులు కోయటం అయిందో, కాలేదో మరి, మరుక్షణం ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

"ఏమోయ్ భగవాన్లూ! మా శ్రీమతి చేతివెట్టు ... ఎప్పుడెప్పుడా ప్రయాణం అనిపిస్తోందా?" నవ్వుతూ భుజంమీద చేయివేసి అడుగుతున్న గోపీ కృష్ణను చూచి, తబ్బిబ్బుపడిపోయాడు మధు క్షణకాలం.

గోపీ గమనించలేదు కదా? ఆవిడ తన గురించి గోపీతో "చెడు"గా చెప్పదు కదా?

"ఏమిటా పిచ్చి చూపు?" గోపీ కృష్ణ నవ్వుతూ, కుదిపేశాడు.

"అబ్బెబ్బే అదేం లేదు ..." నాన్చాడు.




"అలా అనక మరేమంటావ్ లే .. మధూ! ఓ చిన్న సాయం చేస్తావూ?"

"ఏమిటి?" విచిత్రంగా చూశాడు.

"నా అపర్ణను గురించి...ఇందాకా నీ ఫీలింగ్స్ ఎలా వున్నాయో నిర్మొహమాటంగా చెప్పరా ..అలా ఎవరూ చెప్పే అతిథులు లేక, రాకనే అపర్ణ ఇలా నా ప్రాణం తోడేస్తోంది... నువ్వేనా చెప్పెయ్ ఆవిడతో... అపర్ణా! ఇలా రా!" గోపీకృష్ణ మాటలు మధులో మరో రకమైన భావ సంచలనాన్ని రేపాయి...

"ఎందుకు పిలిచారూ?" అపర్ణ గది గుమ్మం వరకూ వచ్చి ప్రశ్నించింది. తలుపు వారగా వున్న ఆమె మధుకు కనిపిస్తోంది. జుట్టు, చుట్టగా అమర్చుకుంది. జాజులు పెట్టుకుంది. ఏదో కళ- ఏదో సౌందర్యం. తను తట్టుకోలేక పోతున్నాడు.

"మధు నీ గురించి... అతగాడు ఫీలైన నిజమైన ఉద్దేశ్యాలేమిటో చెప్పేస్తాడు. వింటావా?"

"తప్పకుండా!" మృదువుగా నవ్విందామె.

"అబ్బెబ్బే...అదేం లేదండీ..." మధు తప్పుకోబోయాడు

"ఫర్వాలేదు, నీ మూలాన్నయినా అపర్ణలో మార్పువస్తే అంతే చాలు నాకు"..గోపీకృష్ణ బాత్‌రూం వేపు వెళ్ళిపోయాడు. అపర్ణ వెళ్ళిపోయింది.

మధులోని మరో వ్యక్తి విజృంభించాడు. ఎంత చక్కటి అవకాశం

ఇచ్చాడు గోపీకృష్ణ? ఆమెను గురించిన తన నిజమైన ఆలోచన ఆమెకు చెప్ప గలిగితే? విని ఆవిడేమంటుంది? గోపీకి చెబితే! ఓహ్! చెబితే ఏం? గోపీ తన నే విషయంలోనూ మందలిం చడు. కారణం, తా మిద్దరి మధ్యా వున్న స్నేహబంధంలో అంతటి చను వుంది.

...మరునాడు గోపీకృష్ణ ఆఫీసుకు వెళ్ళిపోయాడు. సాయంత్రం నాలుగు గంటలకు తనకు ట్రైన్ వుంది! అప్ప టికి తనను సాగనంపటానికి వస్తా నన్నాడు గోపీ...ఈలోగా...ఈలోగా అపర్ణతో ఒక్కసారి... ఒక్కసారి మాట్లాడ గలిగితే?

"టిఫిన్ చల్లారిపోతోంది...మీరు రావచ్చు..." అపర్ణ తియ్యని పిలుపు.

"వస్తాను...మీతో ఓ చిన్న సంగతి మాట్లాడాలి...మీ కభ్యంతరం లేక పోతే..." తడారిపోతున్న పెదవులను నాలుకతో తడిచేసుకున్నాడు

"చెప్పండి .." మృదువుగా అంది.

"మీరిలా వచ్చి కాస్సేపు కూర్చో గలరా?"

"ఆ!" గదిలోకి వచ్చి, తనక్కాస్త దూరంలో వున్న గార్డెనింగ్ ఛేర్‌లో కూర్చుంది.

"మీ గురించిన నిజమైన నా అభి ప్రాయాలు చెప్పమన్నాడు మా గోపీ! మీకు గుర్తుందను కుంటాను."

"చెప్పండి..." స్థిరంగా చూస్తూ అంది

"అతి సాధారణంగా కనిపించే మీలో అసాధారణమైన ఆకర్షణేదో నిండివుంది...అది నన్ను నిలువునా... ఏదో....చేసేసింది!" మాటలు తడబడ్తు న్నాయి.

క్షణ కాలం అపర్ణ అతగాడి కళ్లలోకి చూచింది. ఆమె మొహం ఎర్రగా కణకణ లాడుతున్నట్లుంది.

"ప్లీజ్! మీరు అలా కోపంగా చూడకండి...మీరీ విషయం గోపీకి చెప్పినా ఫర్వాలేదు...నన్ను నేను నిగ్రహించుకోలేక చెబుతున్నాను... అతిథిగా నేకాదు . మిమ్మల్ని చూశాక ఓ మగవాడిగా నే నేది ఫీలయ్యానో అదే చెబుతున్నాను...అపర్ణా! ఐ లవ్ యూ!" ఏదో మైకం ..మరేదో బాధ అతగాడి కళ్లలో గూడుకట్టుకునివుంది.

అపర్ణ అతగాడి వేపు అలాగే చూస్తోంది.

"ఇది తప్పో, ఒప్పో నాకు తెలి యదు ..అసలా సంగతి ఆలోచించలేను కూడా...ఇదే నా అభిప్రాయం.... ఐ లవ్ యూ!"

"మంచిది!" అపర్ణ కంఠస్వరం మృదువుగా పలికింది. "మీ నిజాయితీని మెచ్చుకుంటున్నాను...మీ వుద్దేశ్యాలు అలా వున్నప్పుడు, మీరలా ఫీలైనారు. అందుకు ఎవరి అభ్యంతరం మాత్రం



ఏముంది ? అందు క్కారణమూ నాకు తెలుసు !"

విస్మయంగా చూశాడు మధు ఆమె వేపు...ఆమె తనని మందలించ లేదు...తిట్టలేదు.. గోల చెయ్యలేదు కానీ ఏదో మంత్రం వేస్తోంది..."ఏమిటా కారణం" కుతూహలంగా అడిగాడు.

"మీరు సగటు పురుషులు ! మా వారికి మీ పద్మజ చాలా నచ్చిందట ! మీరు నన్ను...."ఐ లవ్ యూ" అన్నారు ! సాధారణంగా మగవారికి తన భార్య కంటే ఎదుటివాని భార్య నచ్చుతుంది. ఇది నిజం ! ఇందులో ఆశ్చర్య పడాల్సిం దేమీలేదు ..మరి నే వెళ్ళాలిక. మీ టిఫిన్ చల్లారిపోతోంది... ఇంకా స్సేపట్లో వారు వస్తారు....వారికీ టిఫిన్ అమర్చాలి...నే వెళతాను !"

స్కైరిన్‌లో కూర్చున్నాక కూడా మధు ఆ "షాక్" నుంచి తేరుకోలేదు.